# గొడుగు

మూలనున్న గొడుగందుకొని గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు రమణయ్య. చిన్న చినుకులు పడుతున్నాయి. సూర్యుడు ఇంద్రధనుస్సు ఎక్కుపెట్టి ఒకేసారి వారుణాస్త్రం, ఆగ్నేయాస్త్రం ప్రయోగించినట్టుగా ఒకప్రక్క చినుకులు పడుతుండగా, మరోవంక చురుక్కుమంటూ వేడికిరణాలు గుచ్చుకుంటున్నాయి. చినుకులు పడినా పడకపోయినా ఆ గొడుగు వేసుకుంటేగాని రమణయ్య రోడ్డుమీద నడవడు ఒక్క సాయంత్రాలు తప్ప. అందుచేత ఎండకెండి వానకి తడవడంవల్ల కాటోలు నల్లని గొడుగు గుడ్డ రంగు విరిగి బూడిదరంగులోకి మారింది.

బయల్దేరినపని జ్ఞాపకంవచ్చి గొడుగు విప్పి బయల్దేరేడు..."ఒసేవ్ అమ్మడూ తలుపేసుకో" అని కేకేస్తూ.

మీదినుంచి సన్నని తుంపర చల్లచల్లగా పడుతూంటే తలెత్తి చూసేడు. రమణయ్య మబ్బులు కమ్మిన ఆకాశంలా కొంతమేర మిలమిలా మెరుస్తున్న చుక్కల్లో నీలాకాశంలా పురుగులు కొట్టేసిన కన్నాలు మెరుస్తూ కనిపించేయి,

"పట్టపగలు చుక్కల్చూపుతయ్యి నా గొడుగులోకి....అనుకొని నవ్వుకోబోయిన నవ్వుకి "నువ్వేం తక్కువ్వాడివా....నీగొడుగేం తక్కువతిన్నదా....?" 'రమణాబియ్యే' గాడిగొంతు లోపలినుండి పలికి నవ్వు ఉండబెట్టేసింది.

రమణాబియ్యేగాణ్ణి తనే చంపేసేడు లేపోతే ఇలానే మాటిమాటికి బతుకుదారి కడ్డొచ్చి అల్లరిపెడుతుంటాడు ఎన్నిసార్లు చంపేసినా అడుగడుక్కీ బతికొచ్చేసి కామెంటు చేస్తూనే ఉంటాడు. బియ్యేవెనక్కాల తగిలించుకొని కాణీ సంపాదనలేదుగాని....హాయిగా కాణీవోవర్‌కో సంపాదించుకు బతుకుతూంటే....

"నాగేశ్వర్రావుగారూ...." అంటూ పైనుండి పిలిచేడు రమణయ్య.

"ఏ విట్రోయ్‌గారూ గేరూ అంటున్నావ్..ఇదెప్పటినుండీ....రారా అంటూ చాపపరిచి కూర్చోమన్నట్టు చాపమీద కొట్టేడు.

"శ్రీరామా.. ఆపద్బాంధవా....అనాధరక్షకా".... అంటూ కూలబడి "అయ్యో కాలంమారింది. తాహతులు మారేయి.... చూడూ....ఎవరి లిమిట్సులో వాళ్ళుండొద్దూ."

"ఎన్ని నేర్పేవురా....నిజమే నేర్పావా....నీజీవితమే నేర్పేసింది.. నీబియ్యే అయ్యి పదేవిరవై ఏళ్ళయుంటాది కామాల....ఉద్యోగమంటూ కాళ్ళరిగేలాతిరిగేవు. అదేదో సెల్ఫ్ ఎంప్లాయిమెంటు స్కీములాగా ఇప్పుడే బాగుంది నీకు నాలుగు ప్రైవేట్లు చెప్పుకుని బతికేస్తున్నావు."

"ఎంబతుకు లేద్దూ.. నీదగ్గర నీమాట చెప్పాలి. వాడిదగ్గరవాడి మాట చెప్పాలి. ఏ ఎండకా గొడుగు పట్టాలి. ఇన్ని చేసినా చూడు ఇప్పుడింట్లో అన్నీ నిండుకున్నాయి. ఏదో నువ్వు ప్రైవేటు జీతం ఇప్పిస్తావనీ...." నసిగేడు రవణయ్య.

"రవణయ్యా, జీతమడిగేవని కాదు గానీ.. మావాడు మరీ మొద్దు రాచిప్పయి పోతున్నాడ్రా.... ఆబళ్ళోఏంచెప్తున్నారోగానీ పైగా నీదగ్గర ప్రైవేటు కూడాను."

"మీరన్నారని కాదుగాని నాగేశ్వరావుగారూ....జీతమడిగేవరకూ పిల్లల బాగోగులు మనకి జ్ఞాపకంరాని దీనస్థితిలో వున్నామండీ....ఆ బాగోగులు కూడా డబ్బుతో లంకె వెడుతున్నాం" అన్నది మెల్లిగానే అయినా ఆవేదనంతా గడ్డకట్టి చెప్పినట్లుగా వుంది.

"ఏంరోయ్.... ఏవిటో తిడతన్నట్టుగున్నావ్....విన్నన్లేదు. ఆ బళ్ళో మేష్టర్లనంటున్నా."

అవును. నేనూ అదే అంటున్నా. విద్యావిధానంలోని లోపాలన్నిటికి ఉపాధ్యాయుడికే నిందలూ, తిట్లూ....అతడు ప్రత్యక్ష దైవంకాబట్టి! దానిక్కారణం అతని కార్థికంగాగాని, సాంఘికంగాగాని ఒకస్థాయిలేదు ఆస్థితికి దిగజార్చింది మనం. ఉద్యోగాలేక ఎక్కడపడితే అక్కడ గోనెపట్టాలేసుకుని నాలుగు ప్రైవేట్లు చెప్పుకునే మాలాంటి మెథడంతే ఏంటో తెలియని వాళ్ళోప్రక్క, అసలీ బళ్ళెందుకున్నాయో తెలియని మేనేజిమెంట్లు ఓ పక్క, మంచినింప్లిమెంటు చెయ్యడానికెన్ని గోతులున్నాయని తెలిసికూడా మేష్టర్ల మీద నెత్తిడితెచ్చే డిపార్టుమెంటు మరోప్రక్క, తమ పిల్లలమార్క్స్ గురించి ఆలోచించినంతగా వాళ్ళ చదువు సాములగురించి అయిదు నిమిషాలుకూడా ఆలోచించడాని కిష్టపడని పేరెంట్సు ఇంకోపక్క ఉపాధ్యాయుల




జీవితాల్ని ముక్కలు చించిన విస్తరిని చేసారు. అంచేతనే... ఏ భావిభారత పౌరుడే చెక్కలై పోవనీ, ఏ విద్యాలయం ఎలా నాశనమైపోనీ, దేశం ఎంత అధోగతి పాలవ్వనీ అవి వినాశ చెందిపోయి ఏ ఎండకాగొడుగు పట్టడం నేర్పుతున్నాడు ఉపాధ్యాయుడు”.

"అబ్బో...ఉపన్యాసం చాలా బాగుంది. వన్స్‌మోర్ . ." అంటూ కేకేస్తున్న రమణావధియ్యేగాడి గొంతు విప్పించేసరికి ఆవేశం కరిగిపోయింది - ఇంట్లోకి తొంగి చూసి నాగేశ్వరరావు కొడుక్కి కేక పెట్టాడు రమణయ్య.

మంచినీళ్ళుతాగి గ్లాసు కిందపెడుతూ—"ఆ గుర్నాధం కొడుకు కాన్వెంటు చదువు వెలిగిస్తున్నాడు కదా. ఏదో ఊర పొడిచేస్తాడని అందులో చేర్పించేసేడు. వాడు ఇంగ్లీషు ముక్కలు రాగానే నేనరా... దబ్బుతోపని, ఇతగాడు చూస్తే బెల్లపు వినాయకుడికి ముద్దగిల్లి నైవేద్యం పెట్టేరకం" అన్నాడు నాగేశ్వరరావు ముఖకవళికలు కదిపెడుతూ.

"హహ" అని ఋణపుతీరానవ్వి "ఏమంటాడేవిటీ" అన్నాడు నాగేశ్వరరావు.

"ఆయన తరహాపేరు, ఎందుకూ ఉన్నాయి లక్షలు. స్టేట్ బ్యాంకిలోనూ ఉన్నాయి కట్టలు. మనకేవిటుపయోగం? ఈవి వుండాలండీ. దానికి మీతోసరి తూగుతాడేవిటి గుర్నాధం ముఖస్తుతి అనికాదుగాని ఎప్పుడు నాకు తక్కువ చేశారు. మీరు? అప్రైవేటు జీతానికి ఓసారివెళ్తే మావిడ దగ్గర తాళాలుండి పోయేయంటాడు. మరోసారివెళ్తే చిల్లరలేదంటాడు రెండూ వుంటే సుక్కురారం ఇవ్వరాదంటాడు. అదేం మనిషండి మహాప్రభో...."

'బాగాచెప్పావు. గుర్నాధం సంగతిమాత్రం చెప్పాలి రమణయ్యా... అని నవ్వి నవ్వి "ఓరే ప్రసాదూ...అమ్మనడిగి ఓ పదిరూపాయలట్రా..." అని కేకేసాడు నాగేశ్వరరావు.

పుచ్చుకుని, "మరినేవెళ్ళొస్తాబాబూ...ప్రసాదం బాబూ రేపు మజ్జినాళొస్తాను ప్రయివేటుకి...ఆఁ..." అంటూ గొడుగుతీసేడు రమణయ్య.

వీధిలోకివచ్చి అలవాటుగా ఆకాశం వక్క చూసేడు రమణయ్య. ఎక్కడా మబ్బుతునకకూడా కన్పించనీకుండా ప్లేటు ఫిరాయించేసింది ఆకాశం. నెల్లతరబడి జీతాల్లేక అల్లాడుతున్న ఉపాధ్యాయుళ్ళ కిరణాలబెత్తాలతో కసితీరా జనాల నెత్తిమీద కొడుతున్నాడు సూర్యుడు ఎదురు దెబ్బలతో, లోకజ్ఞానంతో, వికసించిన మేష్టారి తెలివితేటల్లా రమణయ్య గొడుగు విచ్చుకుంది.